# మాణిక్యవీణ

మూర్తి నయాపూల్ మీదుగా ఇంటికి వస్తున్నాడు. పేవ్‌మెంట్ మీద ఒక ముసలి వ్యక్తి. ప్రక్కనే ఒక చక్కని వీణ పెట్టుకుని కూర్చున్నాడు. పాత, కొత్త వస్తువులెన్నెన్నో రోజా నయాపూల్ మీద అమ్మకం జరిగిపోతుంటాయి. అమ్మకందార్లు అమ్మే వస్తువుల గురించి గట్టిగా అరుస్తున్నారు. కాని ఆ ముసలితాతమాత్రం అల్లాగే కూర్చొని ఉన్నాడు ముడుచుకుని. శీతాకాలం ప్రారంభమవుతోంది. మూసీపైనుంచి వచ్చే చల్లనిగాలి వళ్ళు వణికిస్తోంది.

ఆ వీణని చూడగానే రాధిక జ్ఞాపకం వచ్చింది మూర్తికి. ఆమెకి సంగీతమంటే ఎంతో అభిమానం. అందులోనూ వీణ అంటే ప్రాణం. రాధిక వీణ వాయించిందంటే ఎండిన చెట్లు చిగురిస్తాయి. ఏడ్చే శిశువులు నవ్వుతారన్నా అతిశయోక్తి లేదు. నిజానికి మూర్తి, వివాహం కాకముందు, నాగేశ్వరస్వామి దేవాలయంలో ఎన్నోమార్లు రాధిక ఇచ్చిన కచేరీలకు హాజరవుతుండేవాడు. ఆమె కచేరీ ఉదంంటే చాలు, ఎన్ని పనులున్నా మానుకుని; ఎంతదూరమైనా వెళ్ళి, ఆమె వీణావాదనం వింటూ తన్మయత్వం చెందుతుండేవాడు. అటువంటి రాధికని ఒక సామాన్య గుమాస్తా అయిన మూర్తితో వివాహానికి సంప్రదింపులు రాసాగేసరికి, అతని ఆనందానికీ, ఆశ్చర్యానికీ అవధిలేక పోయింది. లాంఛనంగా ఏర్పాటయిన పెళ్ళిచూపులతో తాను కావాలనికోరి ఆమెచేత వీణపైగానం చేయించుకున్నాడు మూర్తి. ఆమె సమయోచితంగా శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు అన్న శ్రీ త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తన గానం చేస్తున్నప్పటి దృశ్యం ఎప్పటికీ అతని కళ్ళముందు మెదలుతూనే - ఉంటుంది. ఆమె వైణికురాలే కాదు - చక్కని గాయనికూడా. రాధిక విద్యాధనంపన్నురాలైనా, ఆర్థిక స్తోమతలేని సామాన్య కుటుంబీకురాలు అవడంతో మూర్తికి భార్య కాగలిగింది. చాలీచాలని జీతంతో సంసారం గడుపుతున్నా రాధిక సాంగత్యంలో, ఆమె వీణాగాన సుధారసాన్ని గ్రోలుతూ, ఈ ఈతిబాదలన్నిటినీ మరచిపోగల్గుతుండేవాడు మూర్తి.

వారి ఆనందమయ జీవితాన్ని చూసి సహించలేని విధి, ఆ దంపతులపై ముఖ్యంగా రాధికపై బలమైన దెబ్బ తీసింది. ఆ మహానగరంలో ఒక మారుమూల ఇంట్లో, ఇద్దరు పిల్లలతో జీవితం వెళ్ళబుచ్చుతుండేవాడు మూర్తి. దాన్ని ఇల్లనడం కంటే, ఎండనుంచి కాపాడేగూడు అనడం సరిగా ఉంటుంది. అది చూడడానికైతే పెద్ద దేవిడీయేకాని, చాలా పురాతనమైనది కావడంతో గట్టిగా గాలివీస్తే పడిపోయేటట్లుండేది. ఆ ఇంట్లో వీణ వాయిస్తుండే రాధికని చూసినవారికి, శిధిలాయంలో, శిధిలం కాని విగ్రహంలా అనిపిస్తుండేది. అరణ్యంలోనించి అమృతగానం వినవస్తున్నట్లుండేది చుట్టుప్రక్కలవారికి.

రెండేళ్ళ క్రితం నగరంలో ఎడతెరపిలేకుండా వానలు కురిశాయి. అందులో ఒకరోజు రాత్రి మూర్తి ఉన్న భాగంలో, ఒకగది అసలే పాత గోడలో ఏమో అందులోనూ మట్టిగోడలు కావడంతో,

వానలకి బాగా తడిసి కూలిపోయింది. అయితే అదృష్టవశాత్తూ ఆ గదిలో ఎవరూ పడుకోకపోవడం వల్ల, ఎవరికీ ఏమీ ప్రమాదం జరగలేదు. కాని ఆ గదిలో ఉన్న సామాను చాలా వరకు తుక్కు తుక్కు అయింది. అవన్నీ పోవడం ఒక ఎత్తు. వాటితోపాటు, ప్రాణాధికమైన రాధిక వీణ ముక్కలు ముక్కలయి ఎందుకూ పనికిరాకుండా పోవడం మరొక ఎత్తు. ఆముక్కలయి పోయిన వీణని చూసి రాధిక కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. స్వంత బిడ్డ పోయినదానికంటే ఎక్కువగా గోలపెట్టింది. సామాను పోయినందుకంటే ఎక్కువగా బాధపడ్డాడు మూర్తి. అయితే ఎవరుమాత్రం ఏమి చేయగలరు? ఎవ్వరికీ ఏ అపాయం జరగనందుకు మాత్రం సంతోషించారు. ఆ వీణ పోవడం మటుకు వారి మనసుల్లో చెరగని సంతాప ముద్రలను వేసింది. ఎంతగా మరచిపోవాలనుకున్నా కూడా ఆ సంఘటన - లోనికి దిగిపోయిన ముల్లల్లే కలుక్కుమంటూనే ఉండింది.

అసలే చాలీచాలనీ జీతం, ఆపైన పెరుగుతున్న సంసారం. అందులోనూ ఇల్లు కూలడం ధర్మమా అంటూ ఎన్నో వస్తువులు కొనుక్కోవలసి రావడం, ఆపై మరొక ఇంట్లోకి మరికొంత ఎక్కువ అద్దెలో మారవలసి రావడం - వీటన్నిటితో రాధిక వ్యధని తీర్చడానికి ఎంతగా ప్రయత్నించినా, ఇన్నాళ్ళుగా మరొక వీణని కొనలేకపోయాడు మూర్తి. ఎప్పటికప్పుడు కొనాలనుకోవడమే కాని, ఎప్పుడూ కొనలేక పోవడమే జరుగుతూ వచ్చింది. సంసార పరిస్థితులు తెలిసిన రాధిక, పాపం ఎప్పుడూ, వీణ కావాలని నోరు తెరచి అడుగలేదు. కాని, ఇంటికి, పోయిన శోభని తిరిగి తెచ్చే వీణని కొని ఇవ్వడం తన కనీస కర్తవ్యంగా భావించాడు మూర్తి.

నయాపూల్‌మీద ఉన్న ఆ వీణని చూడగానే గతచరిత్ర అంతా కళ్ళముందు తిరిగింది మూర్తికి. అదికూడా చూడడానికి ఎంతో ముచ్చటగా ఉంది. దానిని ఉపయోగించిన వాళ్ళెవరో కాని, ఎంతో శ్రద్ధతోనూ, జాగ్రత్తతోనూ ఉపయోగించినట్లు ఉంది. మిలమిలా మెరుస్తున్న ఆ దంతపుమెట్లు చూస్తుంటే అసలు అది క్రొత్తవీణేనేమో అనిపిస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా అది, రాధిక వీణలాగానే ఉంది సరిగ్గా. దానిని చూడగానే ఒకసారి తమ పోయిన వీణని చూసినంత ఆనందం కలిగింది మూర్తికి. "ఆ వీణని కొని రాధికకు యివ్వగలిగితే ఆమె ఎంత సంతోషిస్తుంది? ఆమె ప్రాణసమానమైన వీణని, తనకి ప్రాణాధికమైన తన రాధికకు ఇయ్యగలగడం కంటే, భర్తగా తను చేయగల మహత్కార్యం మరేమి ఉంటుంది. ఆలోచనలో పడ్డాడు మూర్తి.

ఆ వీణని చూస్తూ పేవ్‌మెంటుమీద అల్లాగే నిల్చుండిపోయాడు మూర్తి. వెళ్ళి అసలు ఆ వీణ ధర ఎంతో కనుక్కుందామని ఒక్క అడుగు ముందుకు వేశాడు. "ఎంతరోడ్డుప్రక్కన పెడ్తేమాత్రం అంత మంచివీణ ధర తక్కువ ఉంటుందా? పైగా జేబులో డబ్బులు లేకుండా వెళ్ళి బేరం చేయడం కూడా అర్థం లేనిపని అనుకుంటూ వేసిన అడుగు వేసినచోటే ఉంచాడు మూర్తి. తన పరిస్థితులలో దానిని కొనే శక్తిలేక కనీసం దాని ధర అడిగే ధైర్యం కూడా చాలక తన అసమర్థతకి బాధపడుతూ తనని తానే అసహ్యించుకుంటూ ఆ వీణ వంకే చూస్తూ, నడవలేక నడవలేక నడుస్తూ ఇంటిదారి పట్టాడు మూర్తి. దారిపొడుగునా దానిని గురించే ఆలోచనలు.

ఇంటికి వెళ్ళాడన్న మాటేకాని, మనస్సు మనస్సులో లేదు. అల్లాఉండడానికి కారణం ఏమిటని గ్రుచ్చి గ్రుచ్చి అడిగింది రాధిక. కాని తాను ఏమీచెప్పలేక, ఏమీ లేదని తప్పించుకున్నాడు. ఆరాత్రి నిద్రలో కూడా దర్శనం ఇస్తూనే ఉంది ఆ వీణ. రాధిక బ్రహ్మాండమైన సభలో ఆ వీణ వాయిస్తున్నట్లు జనం అంతా పరవశించిపోతున్నట్లూ కలగన్నాడు.

మర్నాడు ఆఫీసుకువెళ్ళి పనిలో మునిగిపోయాక కాని, ఆ వీణ విషయం మరచిపోలేదు మూర్తి.

ఆ సాయంత్రం తిరిగి ఇంటికి వస్తున్నాడు మూర్తి. నయాపూల్ కనబడగానే, తిరిగి నిన్నటివీణ జ్ఞాపకానికి వచ్చి, గుండె ఝల్లుమంది. ఈపాటికి ఇంత మంచివీణని ఎవరో కొనుక్కుని తీసుకుపోయుంటారు అనిపించి మనసు చివుక్కుమంది. అటువంటి వీణని కొనలేకపోయినందుకు హృదయం కలుక్కుమంది.

నయాపూల్‌మీద సగం దూరం నడిచేసరికి, ఆ వీణ మళ్ళీ కనిపించింది. దాన్ని చూడగానే వెన్నుమీద ఎవరో చరిచినట్లయింది మూర్తికి. అప్రయత్నంగా అడుగులు వడివడిగా ముందుకు వేశాడు. వీణకి సమీపంలో ఆగాడే గాని ఏమీ అడగలేకపోయాడు. దాని ధర ఎంత? అని అడగాలని మనస్సు తహతహ లాడుతున్నదెకాని, నాలిక ముందుకు సాగలేకపోతోంది. మనస్సు పరిపరి విధాల పోతోంది. అలోచనల్తో అల్లకల్లోలం అయిపోతున్న మనస్సు, అంతటి చల్లనిగాలిలోనూ, దేహాన్ని వేడెక్కించేస్తోంది.

మూర్తి అక్కడేనిలబడి ఉండడం గమనించిన ఆ ముసలి వ్యక్తి "క్యాహోనా సాబ్" అని వేసిన ప్రశ్నతో తిరిగి ఈలోకంలోకి వచ్చాడు మూర్తి. అప్రయత్నంగా "దీని ధర ఎంత?" అని అడిగాడు వీణని చూపిస్తూ.

"ఒక్కటేమాట ...... నూరు రూపాయలు" అన్నాడు ఆ వ్యక్తి ఆశగా మూర్తి వంక చూస్తూ. పాపం ఆమాత్రం కూడా, దాన్ని గురించి ఎవరూ అడిగినట్లు లేదు.

అంత మంచివీణ, అంత చౌకగా, కేవలం వంద రూపాయలకు అమ్మచూపబడుతోందంటే, నమ్మశక్యం గాలేదు మూర్తికి. ఆ ధర అయితే నిజానికి ఎంతో చవుక, గాని, అంతమాత్రం కూడా పెట్టగలిగే స్తోమత అతనికి ఎక్కడుంది? కాని అడిగి వెళ్ళిపోతే తన అసమర్థత బయటపడుతుంది. దానిని కప్పిపెట్టుకోడానికి "వంద రూపాయలా?" అని ఆశ్చర్యంగా అడిగి, వీణని పరీక్ష చేయడం మొదలుపెట్టాడు మూర్తి. అతని కృత్రిమ ప్రవర్తనకి అతనికే అసహ్య మేసింది.

"అది ఏమి సార్ ..... ఇంతమంచివీణ దుకాన్లో పెట్టి అమ్మితే మూడు వందలు తక్కువ ఉండదు...." అన్నాడు ఆ వ్యక్తి.

"ఏమి ఒక్కటే మాటా?" అని తిరిగి అడిగాడు మూర్తి కొనేవాడిలా పోజిస్తూ.

"మీరేమిస్తారో చెప్పండి." అన్నాడు ఆ వ్యక్తి.

"ఏమిసార్ ..... తెలిసిన వారు మీరు కూడా బేరాలు చేస్తారు." అన్న మాటలు వినిపించాయి. ఎవరా అని చూస్తే, ఎవరో సుమారు ముప్పయి సంవత్సరముల వయసున్న యువకుడు, ఆ ముసలి వ్యక్తికి వెనుకగా నుంచుని కనిపించాడు. అతని మాసిన గడ్డం, రేగిన జుట్టు, చిరిగిన బట్టలు చూసి ఎవరో మరొక అమ్ముకునేవాడు అనుకున్నాడు మూర్తి.

అతని మాటలు పట్టించుకోకుండా "ఒక్కటే మాట చెబుతాను. డెబ్భయి అయిదు ఇస్తాను ఏమంటావు?" అని అడిగాడు మూర్తి.

ఆ వ్యక్తి ఒక్కక్షణం మౌనంగా ఉన్నాడు. "ఏమి సార్ అల్లా అంటారు?" అని నెమ్మదిగా అంటూ ప్రక్కన ఉన్న వ్యక్తి వంక చూశాడు ఆ ముసలతను.

అంత అన్యాయంగా అడిగినందుకు, ఆ అమ్మేవ్యక్తి ముఖంవంక సూటిగా చూడలేక, ఒకవేళ వాడు తిడతాడేమోనని, మనసులోనే భయపడుతూ, ఎల్లాగూ ఇది కుదిరేబేరం కాదులే అనుకుంటూ, ముళ్ళమీద నుంచున్నట్లు నుంచుండిపోయాడు మూర్తి.

"తీసుకోండి సార్" అన్న మాటల్తో మూర్తి గుండె ఝల్లుమంది. బేరమయితే చేశాడు కాని డబ్బు! ఇప్పుడు వెనక్కి వెళ్ళిపోతే ఎంత అవమానం! వాడు ఊరుకుంటాడా? ..... నానా తిట్లు

తిడతాడు.

వీణని పరీక్ష చేస్తున్నట్లుగా నటిస్తూ ఆలోచనలో పడ్డాడు మూర్తి. గుండె దడదడా కొట్టుకుంటోంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వేడిగా వస్తున్నాయి. అంతటి చల్లనిగాలిలో కూడా చెమటలు పట్టసాగాయి.

మబ్బులు కమ్మిన మూర్తి మనసులో మెరుపు మెరిసింది. ఆ రోజు ఆఫీసులో తీసుకున్న ఫెస్టివల్ అడ్వాన్స్ నూరు రూపాయలు జేబులో ఉన్న విషయం జ్ఞాపకానికి వచ్చింది. కాని వెంటనే ఆ డబ్బుతోనే రాధికకి, పిల్లలకి, పండుగకి బట్టలు కొనాలన్న విషయం జ్ఞాపకానికి వచ్చింది. రాధికకి చీరెలు బాగా చిరిగిపోయినా ఎప్పుడు నోరుతెరచి అడుగలేదు. తన సంగతి సరేసరి. అందరికీ కొనగా మిగిలితే తాను కొనుక్కోవాలనుకున్నాడు. పిల్లలు మాత్రం ప్రతి పండుగకీ గోల చేస్తూనే ఉన్నారు. అయినా తను మాత్రం సంక్రాంతి నుంచి వాయిదా వేస్తూనే ఉన్నాడు. ఈ దీపావళికి పండగ అడ్వాన్సు తీసుకోవడంతో, ఏమైనా సరే కొనాలనే నిశ్చయించుకొన్నాడు. మరి ఇప్పుడు ఆ డబ్బుతో వీణ కొనేస్తే, బట్టల సంగతి ఏమిటి? పండుగకొత్త బట్టలు వస్తాయని మురిసిపోతున్న పిల్లలు ఎంత నిరుత్సాహపడతారు! కాని తన రాధిక మాత్రం ఎంతగానో సంతోషిస్తుంది. ఆమె సంతోషించడంకంటే తనకి కావలసింది మరేమి ఉంది! అన్నిటినీ మించి తన యింట్లో పోయిన వెలుగు తిరిగి వస్తుంది. ఆ వీణ తన కుటుంబంలో ఒకటై విషాద చీకట్లను వెడలగొట్టే దీపమై వెలుగుతుంది.

"ఏమిసార్ ... ఆలోచిస్తున్నారు .... చాలా మంచివీణ సార్! వీణ నచ్చకపోతే వాపసిచ్చేయండి సార్. అన్నమాటల్తో తిరిగి ఈలోకం లోకి వచ్చాడు మూర్తి.

"ఆ...... ఏమీలేదు." అంటూ ధీమాగా డబ్బుతీసి, జాగ్రత్తగా లెక్కపెట్టి మరీ ఇచ్చాడు మూర్తి. తాను చేసిన ఘనకార్యానికి, అందరూ తనవైపు చూస్తున్నారో లేదోనని నలువైపులా చూశాడు. ఎవ్వరూ తన విషయం గమనించకపోవడం చూసి నిరుత్సాహ పడ్డాడు. రిక్షాని పిలిచి ఎక్కబోతుంటే ముసలతని ప్రక్కన ఉన్న యువకుడు "సార్ .... నన్ను మీ కూడా వచ్చి వీణని జాగ్రత్తగా మీ ఇల్లు జేర్చమంటారా? రిక్షా కుదుపుకి అది దెబ్బ తిందంటే అనవసరంగా బాధపడాలి" అన్నాడు.

"అవసరం లేదు ..... నేను జాగ్రత్తగానే తీసుకువెళ్తాను, అయినా మీ కెందుకూ శ్రమ?" అన్నాడు మూర్తి.

"శ్రమేమీలేదుసార్ ...... మీకు అభ్యంతరం లేకపోతేనే వస్తాను. విలువైన వస్తువు కాబట్టి చెప్పాను జాగ్రత్త కోసం" అన్నాడు ఆ యువకుడు స్వచ్ఛమైన తెలుగులో.

అతని మాటలు సబబుగానే తోచాయి మూర్తికి. "సరే, రండి" అన్నాడు రిక్షా ఎక్కుతూ. వీణని జాగ్రత్తగా మూర్తి కందించి, తానుకూడా ఎక్కి వీణని ఒకవైపున తన వళ్ళోకి తీసుకున్నాడు.

రిక్షా కదిలింది. టాపులేని రిక్షాలో పోతుంటే, తన వీణవంక జనం చూస్తుంటే, వారివంక సగర్వంగా చూడసాగాడు మూర్తి.

దారిలో ఆ యువకుడు "సార్ ..... మీరు వైణికులా?" అని అడిగాడు.

"లేదు, మా ఆవిడ వాయిస్తుంది." అన్నాడు మూర్తి.

సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

మూర్తి ఇంటివద్ద రిక్షా ఆగింది. వీణని జాగ్రత్తగా దింపి మూర్తి చేతికి అందించి సెలవు తీసుకోబోయాడు ఆ యువకుడు. మూర్తి జేబులోనించి చిల్లర డబ్బులుతీసి కాఫీ త్రాగమని

ఇవ్వబోయాడు. కాని అతను "వద్దుసార్ ... థాంక్సు" అంటూ వెనుదిరిగి చూడకుండా చక చకా వెళ్ళిపోయాడు చీకట్లోకి. చలికో ఏమో అతనిగొంతు భారంగా వుంది.

"రాధికా .... రాధికా ...... నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో." అంటూ సంతోషంతో అరుస్తూ, వడివడిగా అడుగులు వేస్తూ, సావిట్లోకి ప్రవేశించాడు మూర్తి.

"ఏమిటండీ ఆ సంతోషం" అంటూ వంటింట్లోనించి హడావుడిగా సావిట్లోకి వచ్చింది రాధిక. వీణని చూడగానే "ఎక్కడిదండీ ఇంత మంచివీణా?" అంటూ ఛంగున లేడిపిల్లల్లే ఒక్క గంతువేసి వీణదగ్గరకి వెళ్ళింది.

"ఎక్కడిదేమిటి. మనదే" ఉరకలు వేసే సంతోషంతో అన్నాడు మూర్తి.

"ఇవాళ ఏప్రిల్ ఫస్టు కాదే. నన్ను ఫూల్‌ని చెయ్యడానికి" అంది రాధిక నవ్వుతూ.

"నిజం రాధికా ..... మనదే ... కొంటే వచ్చింది" అన్నాడు మూర్తి.

"నిజంగానే! మీరు ఎంత మంచివారండీ!" అంటూ ఆ వీణని చేతుల్లోకి తీసుకుని, చంటిబిడ్డని నిమిరినట్టు నిమరసాగింది. దానిని నిమురుతూనే "మరి డబ్బెక్కడిదండీ! ఇంతకీ ఎంతకి కొన్నారండీ?' ' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఇది ఎంత చవుకగా దొరికిందో తెలుసా .... కేవలం డెబ్బది ఐదు రూపాయలు. పండుగ అడ్వాన్సు మొత్తం దగ్గర వుంది. ఇది బేరానికి వచ్చింది .... కొనేశాను అంతే" అంటూ మూర్తి ఉత్సాహంతో చెప్పసాగాడు మూర్తి.

"అంత చౌకా! కొంపతీసి ఇది దొంగసొత్తు కాదుగదా. లేనిపోనిది మన పీకలమీదికి వస్తుందో ఏమో!" అంది భయంతో. రాధిక.

"అటువంటిదేమీ కాదులే. ఈ ఊళ్ళో ఎంతటి మంచి వస్తువులైనా, ఎంతో చౌకగా పోతుంటాయి. ఏ నవాబో దివాళా తీసి ఉంటాడు. సరుకులన్నీ బజారు కెక్కుంటాయి" అన్నాడు మూర్తి సామాన్యంగా జరుగుతుండే విషయం చెబుతూ.

"ఏమైనా ఈ వీణని చూస్తుంటే, దీనిని ఉపయోగించిన వాళ్ళెవరో గాని, దీనిని ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపయోగించినట్లు అనిపిస్తోంది. ఇది ఏ మహా విద్వాంసునిదో? పాపం! వాళ్ళు దీనిని ఏ పరిస్థితులలో అమ్ముకున్నారో!" అంది రాధిక బాధగా.

"ఏమైతేనేం ...... ఇన్నాళ్ళకి మళ్ళీ మన ఇంట్లో వీణ వెలిసింది. పైగా ఇంత చవగ్గా దొరకడం మన అదృష్టం." అన్నాడు మూర్తి.

"నిజమేనండీ .... పోయిన మన వీణే తిరిగి జన్మఎత్తి మన ఇంటిలో వెలిసినట్లుగా అనిపిస్తోంది దీనిని చూస్తే" అంది రాధిక ఆనందంతో.

"ఇంత మంచివీణని కొనడానికి కూడా చాలాసేపు తటపటాయించాను తెలుసా. ఈ అడ్వాన్సుతో ఎప్పటినుంచో కొనాలనుకుంటున్న నీ బట్టలు కొనాలనుకున్నాను. దీనికే ఖర్చుపెట్టేస్తే మరి బట్టలు కొనడం కుదరదు కదా.... అందుకని" అన్నాడు.

"పోనిస్తురూ ... మనం కొనాలనుకుంటే మాత్రం ఇంత మంచివీణ ఇంత చవగ్గా దొరుకుతుందా? బట్టలు ఇప్పుడు కాకపోతే మరోసారి కొనుక్కోవచ్చు" అంది రాదిక.

రాధిక తన అభిప్రాయాన్నే సమర్థించినందుకు ఎంతో సంతోషించాడు మూర్తి. "ఆ ..... అన్నట్లు పిల్లలేరీ .... చడీ చప్పుడూ లేకుండా ఉంది ఇల్లు" అన్నాడు మూర్తి.

"అన్నాలు తిని పడుకున్నారండీ ..... ఇప్పుడేమైనా తక్కువమయింది కనుకనా ..... ఎనిమిదవు

తోంది" అంది రాధిక.

"అబ్బా .... ఎనిమిదా! ఈ సంతోషంలో నాకు సమయమే తెలియలేదు చూశావా?" అన్నాడు మూర్తి.

"మీకే అంత సంతోషంగా ఉంటే నాకెంత ఆనందంగా ఉంటుందో వేరే చెప్పాలా" అంటూ వీణని మీటబోయింది రాధిక.

"ఆ ..... ఆ .... అప్పుడేనా .... కొత్తవీణ .... మంచిరోజు చూసి, కాస్త పసుపు కుంకుమపెట్టి మరీ మొదలుపెట్టు" అన్నాడు మూర్తి నవ్వుతూ.

'నిజమేనండీ ..... సంతోష పారవశ్యంలో ఆ విషయమే మరిచాను. నాకంటే మీరే నయం. ' అంటూ వీణని లోనికి తీసుకుపోయింది రాధిక.

★ ★ ★

ఇరవై రోజులు గడిచిపోయాయి. ఈ ఇరవై రోజుల్లోనూ రాధిక వీణ వాయించనిరోజు లేదు. ఆ ఇంట్లో నిజంగా నవ వసంతం వెల్లివిరియసాగింది. పోగొట్టుకున్న ఆనందం తిరిగి లభ్యమయ్యింది. మోడువాసిన హృదయాలు తిరిగి చివురించసాగాయి. ప్రతి ఆదివారం మూర్తి ఇంట్లోనే ఉండి, సాయంత్రం పూట కనీసం రెండుగంటలసేపు, రాధికచేత వీణ కచ్చేరీ చేయించుకొని వింటూ తన్మయత్వం చెందుతుండేవాడు.

ఆ రోజు ఆదివారం. సాయంత్రం ఏడుగంటలయింది. మూర్తి మామూలుగా, పడక గదిలో రాధిక వీణ వాయిస్తుంటే, మంచంమీద కూర్చుని, విని ఆనందిస్తున్నాడు. కిటికీవైపు ఉన్న మంచంమీద చంటిపిల్ల కదుల్తుంటే, జోకొడ్దామని వెళ్ళాడు. కిటికీ దగ్గరికి వెళ్ళేసరికి కిటికీ ప్రక్కనే గోడనానుకుని ఎవరో నుంచుని లోనికి చూస్తున్నట్లుగా, చీకటిలో మసకగా కనిపించింది. వాళ్ళ పడకగది నానుకునే ఖాళీస్థలం ఉంది. "ఎవరూ?" అని పిలిచాడు మూర్తి. ఎవరూ పలక్కపోయేసరికి వీధిలోకి వెళ్ళి చూశాడు. కిటికీ దగ్గర ఎవరూ లేరు. దూరాన్నుంచి ఎవరో వెళ్ళిపోతున్నట్లనిపించింది. తాను పొరబాటు పడ్డానేమోననుకుని తిరిగి లోనికి వచ్చాడు మూర్తి.

మరుసటి ఆదివారం కూడా అటువంటి సంఘటన జరిగింది. అయితే ఈసారి, ఎవరో వ్యక్తిని గమనించిన మూర్తి, ఏమీ మాట్లాడకుండా, దొడ్డిదోవంట వెళ్ళి, ఆ వ్యక్తిని వెనకాలనుంచి, గట్టిగా మెడపట్టుకున్నాడు. ఆ వ్యక్తి కస్సుమని అరచి గిజగిజ లాడిపోయాడు. మూర్తి బలిష్టమైన పిడికిలిలోంచి, బక్కచిక్కిన ఆ వ్యక్తి తప్పించుకోలేక పోయాడు.

"ఎవడ్రా నువ్వు? ఏం చేస్తున్నావిక్కడ?" అని గర్జించాడు మూర్తి.

"నేను ..... నేనుసార్ ...." అంటూ నసిగాడు ఆ వ్యక్తి.

"లోనికి రారా... నీ సంగతి కనుక్కుంటా...." అంటూ ఆ వ్యక్తిని ఇంట్లోకి లాక్కొచ్చాడు మూర్తి.

ఆ వ్యక్తి భయంతో నిలువునా కంపించి పోయాడు. వెల్తుర్లో ఆ వ్యక్తిని చూసేసరికి ఎక్కడో చూసినట్లనిపించింది మూర్తికి. అతనివంక పరీక్షగా చూడటం మొదలు పెట్టాడు.

"నేను సార్ ... నేను. ఆ రోజున మీ ఆవిడ వీణ తీసుకుని వచ్చిన వాడిని" అన్నాడు ఆ వ్యక్తి.

ఆ మనిషిని గుర్తు పట్టాడు మూర్తి. "ఆ, నువ్వా! ఏం చేస్తున్నావు ఇక్కడ?" అని అడిగాడు స్వర తీవ్రత తగ్గించి.

ఈ గలభా విని రాధిక సావిట్లోకి వస్తూ గుమ్మం దగ్గరే ఉండిపోయింది!

ఒక్క క్షణం మౌనంగా ఊరుకున్నాడు ఆ వ్యక్తి. చివరికి "వీణ వింటున్నాను సార్" అన్నాడు. అతను ఏమి అంటున్నదీ అర్థం కాలేదు మూర్తికి.

"వీణ వినడమా! ఈ చీకట్లోనా! అందులోనూ దొంగచాటుగా పొంచుండి వినడమా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నిజం సార్ .... నన్ను మీరు నమ్మకపోవచ్చు. కాని నిజం అదే" అన్నాడు ఆ యువకుడు నెమ్మదిగా.

"నా కేమీ అర్థం కావడం లేదు. అసలు నువ్వెవరు?" అన్నాడు మూర్తి.

"చెప్తాను. అంతా చెప్తాను. దయచేసి కొంచెం మంచి నీళ్ళియ్యండి" అన్నాడు అతను లోతైన కళ్ళతో చూస్తూ.

రాధిక వంక చూశాడు మూర్తి నీళ్ల తెమ్మన్నట్లుగా. వెంటనే రాధిక వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చింది.

ఆ వ్యక్తి నెమ్మదిగా నీళ్ళన్నీ త్రాగేశాడు. "మీకు అభ్యంతరం లేకుంటే ఆ బల్లమీద కూర్చుంటా, నిలబడడానికి ఓపికగా లేదు" అన్నాడు.

ఆ వ్యక్తి మాటల్లో ఉట్టిపడుతున్న సంస్కారం చూసి అచ్చెరువందాడు మూర్తి. "అల్లాగే .... కూర్చునే చెప్పు" అన్నాడు తాను కుర్చీలో కూర్చుంటూ.

ఆ యువకుడు దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు. తల ఎత్తి నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు. "మీ దంపతులిద్దరికీ వీణా వాద్యం మీద అపరిమితమైన అభిమానం అనుకుంటాను. ప్రఖ్యాత వైణికులు రామనాధ శాస్త్రి గారి పేరు మీరు వినే ఉంటారు?" అన్నాడు.

"శాస్త్రిగారి పేరు తెలియని దెవ్వరికి? వారు భారతదేశమంతటా పేరుగాంచిన వారాయె. ఫిడేలు వాద్యంలో ద్వారం వారిది ఎంతటిపేరో వీణలో వారికంత పేరు. అయితే అటువంటి మహానుభావులంతా గత తరంలోని వారే." అన్నాడు మూర్తి.

ఆ వ్యక్తి ముఖంలో వెలుగు కనిపించింది. కళ్ళు మిలమిలా మెరిశాయి. చిరునవ్వు ముఖంతో "వారు మా నాన్నగారు" అన్నాడు.

"ఏమిటీ! శాస్త్రిగారు మీ నాన్నగారా?" అన్నాడు మూర్తి ఆశ్చర్యంగా. అతని మాటలు నమ్మలేక పోతూ.

"నిజంగా!" అంది రాధిక.

"అవును నిజంగానే, నా ఆకారం చూసి మీరు నమ్మలేకపోవచ్చు." అన్నాడు ఆ వ్యక్తి!

మరి మీరేమిటి ఇలాగున్నారు. ఆ.... అడగడం మరిచాను మీ పేరేమిటి?" అన్నాడు మూర్తి. అంతసేపూ "నువ్వు" అంటూ సంబోధిస్తూ అప్రయత్నంగా "మీరు" అని వచ్చేసింది అతని నోటివెంట.

"ఇది నా కర్మ ...... నేను విధివంచితుడిని" అని భారంగా నిట్టూర్చి తిరిగి చెప్పసాగాడు ఆ వ్యక్తి.

"నాపేరు కృష్ణశాస్త్రి. మా నాన్నగారికి నేను ఏకైక పుత్రుడిని. అందులోనూ నా చిన్నతనంలోనే మా అమ్మగారు పోవడంతో, మా నాన్నగారి పంచప్రాణాలూ నామీదే ఉండేవి. ఆయన నన్ను అల్లారుముద్దుగా పెంచారు. వీణా వాదనంలో ఆయన్ని మించినవాడిగా చేయాలని నామీద ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. అమిత శ్రద్ధతో నాకు వీణ నేర్పారు. దానికితోడు నాకు కూడా అందులో ఎంతో అభిరుచి ఉండడంతో, పదునారు సంవత్సరాలు రాకముందే, నేను ఎంతో ప్రావీణ్యం

సంపాదించాను. నాకు లోకంలో ఉన్నవి రెండే రెండు, ఒకటి మా నాన్న, రెండు వీణ. నాకు విద్య పూర్తిగా వచ్చిందన్న నమ్మకం ఆయనకి కలిగాక, ఒకసారి ఆయన, నాచేత త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలలో, హరి నాగభూషణం గారి సమక్షంలో, ప్రత్యేకంగా మొట్టమొదటి కచేరీ ఏర్పాటు చేయించారు. ఆరోజు అద్భుతంగా వాయించాను నేను. సూది క్రిందపడితే చప్పుడు వినబడేటంత నిశ్శబ్దంగా జనం విన్నారు. పసిపిల్లలు కూడా ఏడుపుమాని నా కచేరీ విన్నారంటే అతిశయోక్తి కాదు. కచ్చేరీ పూర్తిగా అయిన తర్వాత, హరినాగభూషణం గారు, ఇంకా ఎందరో విద్వాంసులు, పెద్దలు నన్ను ఆశీర్వదించి, "శహభాష్" తండ్రి పేరు నిలబెట్టావు. తండ్రిని మించిన వాడి వయ్యావు." అని ప్రశంసిస్తుంటే నా ఆనందానికి అవధిలేకపోయింది. ఇంక మానాన్నగారి ఆనందం వర్ణనాతీతం. ఆయన కళ్ళల్లో ఆనందాశ్రువులు! సంతత ధారాప్రవాహంగా కారడం మొదలుపెట్టాయి." కృష్ణశాస్త్రి చెప్పడం ఆపి భారంగా నిట్టూర్చాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. మూర్తి, రాధిక చెవులు రిక్కించి వింటున్నారు.

చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ తిరిగి చెప్పసాగాడు శాస్త్రి. "ఏరోజునైతే నాలో ఆనందం కట్టలు తెంచుకొని ప్రవహించిందో, ఆ రోజే అవధిలేని విచారం నన్ను ఆశ్రయించింది, నా ఆనందం మా నాన్నగారి సంతోషం చూసి, విధి సహించలేకపోయింది. అసలే గుండె జబ్బున్న మా నాన్నగారు సభికులు నన్ను పొగుడుతుంటే విని, ఆ ఆనందం పట్టలేక, సభాప్రాంగణంలోనే స్పృహ కోల్పోయి పడిపోయారు. వెంటనే వైద్యులని రప్పించారు. కాని ఆయన ఆనందం నుంచి కోలుకోకుండానే, శాశ్వతంగా, నవ్వు ముఖంతో కన్నుమూశారు. ఏ విద్య కోసమై నామీద మా నాన్న గారు ఆశలు పెట్టుకున్నారో, ఆ విద్యే, మా నాన్నగారిని నా నుంచి శాశ్వతంగా దూరం చేసింది! ఆ బాధలో నేనూ చాలా రోజులు వీణ ముట్టుకోవడం మానేశాను. వీణని చూస్తేనే ఆయన మరణ సంఘటన నా కళ్ళముందు మెదిలేది. కాని రోజులు గడుస్తుంటే, ఏ ఆశయం కోసం మా నాన్నగారు బ్రతికారో, దానిని సఫలం చేయవలెనని భావించి తిరిగి వీణా సాధన చేయడం మొదలుపెట్టాను.

అప్పటికి నాకు కేవలం పద్దెనిమిదేళ్ళు. లోకానుభవం బొత్తిగా లేదు. వీణపై నున్న శ్రద్ధ నాకు చదువుపై లేదు. ఫలితంగా నాకు చదువు సరిగ్గా అబ్బలేదు. స్కూల్ ఫైనల్ కూడా పూర్తి చేయలేదు. ఆ విషయమై మానాన్న గారు కూడా పట్టించుకోలేదు. మాకు ఏదో కొద్ది ఆస్తి ఉండేది. పైగా మా నాన్నగారి కచ్చేరీలో మంచి మొత్తాలు వస్తుండేవి. వీటితో రోజులు బాగా గడిచిపోతుండేవి.

మా నాన్నగారు పోయాక నాకు జీవితం అంటే ఏమిటో తెలిసి వచ్చింది. నా అసమర్థత వల్ల, లోకానుభవం లేకపోవడం వల్ల ఉన్నకొద్ది ఆస్తి అచిరకాలంలోనే హరించుకుపోయింది? ఉద్యోగం చేయవలసిన అవసరం కలిగింది. స్కూల్ ఫైనల్ అయినా ప్యాసవని నాకు ఎవరిస్తారు ఉద్యోగం? ఉద్యోగం కోసం తిరిగి తిరిగి వేసారిపోయాను.

చివరకు నాకు అనిపించింది. తలక్రింద కొండను పెట్టుకొని రాళ్ళకోసం వెతుకుతున్నానేమోనని. నాకొచ్చిన విద్యతో నాలుగుచోట్ల వీణ పాఠాలు చెప్తే నా పొట్ట గడవదా అనిపించింది. అందుకు ప్రయత్నించాను. అయితే అదీ అడియాస అయింది. విద్యార్హతలు లేకపోవడం ఉద్యోగం దొరకటానికి ప్రతిబంధకమయితే, ఈ విషయంలో నా యౌవనం నాకు అడ్డుతగిలింది. వయస్సులో ఉన్న నా దగ్గిర ఆడపిల్లలకు విద్య నేర్పించడానికి, ఏ తల్లిదండ్రులు అంగీకరించలేదు. నేర్చుకోవాలని కోరిక ఉన్న మగ పిల్లలూ అరుదుగా కనిపించారు. కావాలనుకున్న కొద్దిమందికీ కూడా, నేను మరీ చిన్నపిల్లవాడిగా కనిపించడంతో నా ప్రతిభని శంకించి నా దగ్గిర నేర్పించడానికి ఒప్పుకోలేదు.

గడచిన ఈ పది సంవత్సరాలలోనూ, నేను పడ్డపాట్లు వర్ణనాతీతం. ఇన్నేళ్ళుగా అంటిపెట్టుకున్న

స్నేహితుడు, గురువు, దైవం అన్నీ ఈ వీణ ఒక్కటే. కేవలం ఆ సాధనలోనే రోజులు గడుపుతూ నా విచారాలు మరచిపోతుండేవాడిని. పొట్టకోసం, అభిమానం చంపుకుని నేను ఎన్నెన్నో హీనమైన పనులు చేశాను. అయినా విధి ఎదురుతిరగటంతో ఎందులోనూ నిలకడలేక పోయింది నాకు. ఇంట్లో ఉన్న చెంబూ, తప్పాలాలతో సహా ఒక్కొక్కటే అన్నీ అమ్ముకుంటూ పొట్టనింపుకున్నా. అన్నీ అయిపోయినా, మా నాన్నగారి వీణని మాత్రం నేను అమ్మలేదు. చివరికి అదికూడా బ్రోకరు ద్వారా అమ్మించాను. అదే మీరు కొన్నారు. దానిమీద వచ్చిన సొమ్ము ఖర్చు అయిపోగానే నా సర్వస్వంగా భావించుకున్న నా వీణ నాకు దూరం అయిపోయాక; ఈ లోకంలోనించి వెళ్ళిపోవాలనుకున్నాను. అయితే మిమ్మల్ని చూడగానే, సంస్కారవంతులు అనిపించింది. అందుకే వీణని తెచ్చేనెపంతో, ఆరోజు మీవెంట వచ్చాను. ఆ తర్వాత ఒకటి రెండు రోజులు మీ యింటివైపు వస్తే మీ యిల్లాలు, వీణపై అమృతవర్షం కురిపిస్తున్నారు. నానుంచి దూరమైపోయినా, నా వీణ విద్వాంసుల చేతిలో పడినందుకు ఎంతో సంతోషించాను. ఆ శబ్దం వినగానే నా వళ్ళు పరవశత్వం చెందుతుంది. అందుకే తరచుగావచ్చి మీ కిటికీదగ్గిర నుంచొని వింటుండసాగాను. ఆ నాదమే నాలోని ఆత్మహత్యా ప్రయత్నాన్ని దూరంచేస్తూ, జీవితేచ్ఛని కలిగిస్తోంది." - ముగించాడు కృష్ణశాస్త్రి.

అతని దీనగాథను వింటూ ప్రతిమల్లా ఉండిపోయారు మూర్తీ, రాధిక. మూర్తి మనస్సులో సందేహపు పొరలు ఇంకా తొలగిపోలేదు. "ఒక్కసారి మీ చేత్తో వీణపై కీర్తన వాయించండి." అన్నాడు.

"అంతకంటేనా!" అన్నాడు ఉత్సాహంగా శాస్త్రి.

రాధిక వీణని తీసుకొని వచ్చి శాస్త్రిముందుంచింది.

ఆ వీణని స్పృశించగానే శాస్త్రి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాటిని తుడుచుకుని, వీణపై ఎంతో మనోహరంగా, కదనకుతూహల రాగంలో "రఘువంశ సుధాంబుధి" అన్న కీర్తనని వాయించాడు. అతను తన్మయత్వంతో బాహ్య ప్రపంచాన్నే మరచి వాయించాడు.

"సందేహంలేదు. శాస్త్రి చెప్పింది అంతా నిజమే" అనుకున్నాడు మూర్తి. వాయించడం అవగానే వెళ్ళి అతని రెండు చేతులూ పుచ్చుకొని "క్షమించండి. మీరెవరో తెలియక మీమీద చేయిచేసుకొన్నందుకు చాలా బాధపడుతున్నాను. మీవంటి విద్వాంసుని కలుసుకొన్నందుకు, ఆ పైన రామనాథ శాస్త్రి గారివంటి మహానుభావుల వీణ మా ఇంటిని పావనం చేసినందుకూ ఎంతో సంతోషిస్తున్నాను." అన్నాడు పారవశ్యంతో.

"ఫర్వాలేదు. పరిస్థితు లటువంటివి. ఏమైనా మీరు నా కథ విశ్వసించారు. అదే నాకు సంతోషం" అన్నాడు శాస్త్రి.

"ఎంతమాట! ఇంకనుంచి మీరు మాకు మిత్రులు. ఈ రాత్రికి ఇక్కడే భోజనం చేయండి." అన్నాడు మూర్తి.

"మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి. ఇప్పుడు కాదు మరొకసారి వస్తాను. నేను పోయి వస్తాను" అన్నాడు శాస్త్రి.

"లేదండీ. మీరు భోజనం చేస్తే మాకు సంతోషంగా ఉంటుంది" అంది రాధిక.

"అమ్మా .... మీరిద్దరూ బలవంతం చేస్తుంటే నేనేమని చెప్పను? మీ ఇష్టప్రకారమే కానివ్వండి," అన్నాడు కృష్ణశాస్త్రి.

ఆ రాత్రి ముగ్గురూ సంగీత విషయాలు చర్చించుకుంటూ ఆనందంగా భోజనం చేశారు.

ఆనాటినుంచీ, కృష్ణశాస్త్రి వారికి బాగా సన్నిహితుడయి పోయాడు. వారి ఇల్లు సరస్వతీ

సామ్రాజ్యంగా మారింది. శాస్త్రి అతి తరచుగా వారి ఇంటికి వస్తుండేవాడు. కొంతసేపు రాధికా, కొంతసేపు శాస్త్రి వీణ వాయిస్తుండేవారు. వారి గానం వింటూ ఆనందించేవాడు మూర్తి. శాస్త్రి జరుగుబాటు గురించే వారు బాధపడుతుండేవారు. ఏదైనా ఉద్యోగం దొరికేవరకు అతన్ని తమతోటే ఉండిపొమ్మన్నారు. కాని, ఆత్మాభిమానంకల అతడు అందుకు ఒప్పుకోలేదు. అందుకని ఏవో పండుగలు, పబ్బాలు పేరుతో మూర్తి దంపతులు, తరుచుగా శాస్త్రిని తమ ఇంటికి భోజనానికి పిలుస్తుండేవారు.

శాస్త్రి తరుచుగా "ఈ వీణ నా ప్రాణమమ్మా. దీన్ని విడిచి నేను బ్రతకలేను. మీ దంపుతుల పుణ్యమా అని, మీ ఇంటికి వచ్చి, నా వీణని ఉపయోగించుకునే భాగ్యం నాకు మీరు కలగజేస్తున్నారు కనుకనే నేను ఇంకా బ్రతికి ఉన్నాను. కాని లేకుంటే ఏనాడో ప్రాణం వదిలి ఉండేవాడిని" అంటూండేవాడు.

"మంచి రోజులొస్తాయి. ఎప్పుడూ అల్లా అనుకోవద్దు," అని అతన్ని వారు ఊరడిస్తుండేవారు.

* * *

ఒకరోజు శాస్త్రి దిగాలుగా మూర్తి ఇంటికి వచ్చాడు. తనకు విజయవాడలో ఒక ఫ్యాక్టరీలో ఒక చిన్న ఉద్యోగం దొరికిందని చెప్పాడు. మూర్తీ రాధికా చాలా సంతోషించారు. అతన్ని అభినందించబోయి అతని ముఖంవంక చూసి ఆగిపోయారు. అతని ముఖంలో అంతులేని వ్యధ గోచరిస్తోంది.

మూర్తి దంపతులను విడిచి వెళ్ళడమంటే తనకి చాలా బాధగా ఉందని చెప్పాడు శాస్త్రి. అన్నిటినీ మించి, తన వీణని విడిచి తను దూరంగా ఉంటూ బ్రతికి ఉండలేనని చెబుతూ వెక్కివెక్కి ఏడ్చాడు. దుఃఖం సంబాళించుకుని, తిరిగి మర్నాడు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

శాస్త్రి వెళ్ళిపోయిన తర్వాత మూర్తీ రాధికా చాలాసేపు, దిగాలుగా ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయారు. చివరికి మూర్తి అన్నాడు. "రాధికా, వీణని విడిచి వెళ్ళడమంటే అతను ఎంత బాధపడ్డాడో చూస్తున్నావుగా" అన్నాడు.

'అవునండీ..... అతన్ని చూస్తే జాలివేస్తోంది. అతన్ని ఎల్లా ఓదార్చాలో బోధపడడం లేదు.॥ అంది.

"ఒక్కమాట చెబుతాను రాధికా, ఏమీ అనుకోవుకదా?" అన్నాడు మూర్తి నెమ్మదిగా.

"నన్నా మీరు ఇల్లా అడుగుతోంది. మీ ఇష్టమే నా ఇష్టం" అంది రాధిక.

కొంచెంసేపు మౌనంగా ఊరుకున్నాడు మూర్తి. తర్వాత "ఈవీణని అతనికి ఇచ్చేద్దాం. ఒక మంచివాడు, ఒక విద్వాంసుడు, మనకి సన్నిహితుడైన వ్యక్తికి ఆనందం కలిగించడం కంటే మనం చేయగల మహత్కార్యం ఏమి ఉంటుంది?" అన్నాడు ఆవేశంతో.

"ఈ వీణనా?" కొయ్యబారిపోయింది రాధిక.

"అవును. నీవే ఆలోచించు. ఈ వీణని చూసుకునే అతను జీవిస్తున్నాడు. దీనినుంచి దూరమై ఉంటే ఏనాడో జీవితాన్ని చాలించుకుని ఉండి ఉండేవాడు. ఈ వీణతో తిరిగి ఏర్పడిన సంబంధమే అతనికి నూతన జీవితాన్ని ఇచ్చింది. రాకరాక ఇప్పుడు పరాయి ఊళ్ళో అతనికి ఉద్యోగం వచ్చింది. ఈ వీణమీదే పంచప్రాణాలు పెంచుకున్న అతను నిత్యమూ దిగులుతో, పనిసరిగ్గా చేయలేకపోయాడంటే, ఆ కాస్త ఉద్యోగం పోయినా పోవచ్చు. అప్పుడు అతని గతి ఆలోచించు. అతను జీవితంలో ఓడిపోయి ఆత్మహత్య చేసుకున్నా చేసుకోవచ్చు. మనం చేయగలిగిన ఈకాస్త త్యాగంవల్ల

ఒక వ్యక్తికి ఆనందం కలగడమే కాకుండా, జీవితం కూడా నిలబడగలిగితే, అంతకన్న మనకీ, మన వీణకీ సార్థకత ఏమి ఉంటుంది? ప్రాణం లేని ఈ వీణ, ప్రాణంఉన్న వ్యక్తి ప్రాణం నిలబెట్టగలిగితే అంతకంటే మహత్కార్యం ఏమి ఉంటుంది?" ఎంతో ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు మూర్తి.

"అది నిజమేననుకోండి. కానీ ....." రాధిక ఏదో చెప్పబోయింది.

"నీ బాధ నాకు తెలుసు రాధికా. మన ఇంటిలో దీపమై వెలుగుతున్న ఈ వీణ ఇచ్చేసి కోరి చీకటి తెచ్చుకుందామంటున్నా వనుకుంటున్నావు కదూ. ఈ విషయంలో నీతోపాటు నేను బాధపడుతూనే ఉన్నాను" అన్నాడు మూర్తి.

అతని ముఖంలో అంతులేని ఆవేదన ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"అదికాదండి. మీరొక మంచిపని చేస్తానంటే నేనెప్పుడూ కాదనను. మీ సంతోషమే నా సంతోషంగా భావించుకుంటాను. నా బాధ అదికాదు. అతను నిత్యమూ డబ్బుకోసం ఇబ్బంది పడుతుండే మనిషి ..... ఈ చిన్న ఉద్యోగంలో వచ్చే జీతంతో అతనికి ఎల్లానూ చాలదు. అటువంటప్పుడు, ఏ అవసరమో ప్రాణంమీదికి వస్తే మళ్ళీ ఈ వీణని ఇంకెవరికైనా అమ్మేయడని నమ్మకం ఏమిటి? అప్పుడు అంతమంచి వీణ అతనికి కాకుండా, మనకీ కాకుండా పోతుంది గదా? అందుచేత అన్నీ ఆలోచించుకుని మీరు ఎల్లాచేస్తే, బాగుంటుందనుకుంటే అల్లాగే చేయండి. మీరు ఏం చేసినా నాకు సంతోషమే" అంది రాధిక.

మూర్తి ఆలోచనలో పడ్డాడు. రాధిక చెప్పింది అక్షరాలా నిజం. తాను అంతదూరం ఆలోచించలేదు. బాగా ఆలోచించి చివరకి అన్నాడు. "నువ్వు చెప్పింది నిజమే రాధికా. అతని శ్రేయస్సు దృష్ట్యా ఏది మంచిదని మనకితోస్తే అది చేయడం మన ధర్మం. ఆ మంచితనాన్ని అతను నిలుపుకోలేకపోతే అది అతని కర్మం. "ఇయ్యక పోయామే ఇచ్చిఉంటే బాగుండి ఉండేఏడేమో అని తర్వాత నం బాధపడకుండా, మన ధర్మంగా మనం ఇచ్చేద్దాం. చూద్దాం అతని మంచితనం మీద నమ్మకం ఉంచి ఇచ్చేద్దాం" అన్నాడు మూర్తి.

"అయితే మీ ఇష్టం" అంది రాధిక ప్రశాంత చిత్తంగా.

ఆ రాత్రి కృష్ణశాస్త్రి మళ్ళీ వచ్చాడు. తాను మర్నాడే విజయవాడ వెళ్తున్నాననీ, వారివద్ద సెలవు తీసుకోడానికి వచ్చాననీ చెప్పాడు. వెళ్ళబోయే ముందు అతను ఎంతో ఆవేదనతోనూ, ఆవేశంతోనూ వీణ వాయించాడు. చివరికి లేచి కళ్ళనీళ్ళు తిరుగుతుండగా సెలవు తీసుకున్నాడు.

మూర్తి "శాస్త్రిగారూ ... మీరేమి అనుకోకుండా ఉండే ఒక్కమాట చెబుతాను" అన్నాడు.

ప్రశ్నార్థకంగా మూర్తివంక చూశాడు శాస్త్రి.

"మీరు వెళ్ళేది కొత్త ఊరు. అక్కడ మీకు సన్నిహితులు ఎవ్వరూ లేకపోవచ్చు. మీకు కాలక్షేపానికి తోడుగా వీణని తీసుకు వెళ్ళండి" అన్నాడు.

శాస్త్రి ముఖంలో ఒక్కసారి ఆనందపు మెరుపు మెరిపసింది. దాన్ని కప్పివేస్తూ తిరిగి విషాద మేఘాలు అలుముకున్నాయి! "మీ ఔదార్యానికి కృతజ్ఞుడిని. కాని అక్కడ నేను ఎన్నాళ్ళు ఉంటానో తెలియదు. తిరిగి ఇక్కడికి వస్తాననే నమ్మకమూ లేదు. అటువంటప్పుడు ఎంతో ప్రాణప్రదంగ చూసుకుంటున్న మీ నుంచి వీణని దూరం చేసి, మీ మనస్సులు కష్టపెట్టడం నాకు ఇష్టం లేదు. ఒకవేళ మీరు నా మీద ప్రేమతో వీణని తిరిగి నాకు శాశ్వతంగా ఇచ్చేసినా, మీ డెబ్బై ఐదు రూపాయలూ తిరిగి ఇచ్చే శక్తి నాకు లేదు. కనీసం వాయిదాలలో నైనా తీర్చే స్తోమత ఉంటుందని నాకు తోచదు. అటువంటప్పుడు మీరు ఇంతటి మహత్తర త్యాగం చేయడం నాకు ఇష్టంలేదు" అన్నాడు బాధగా

"డబ్బు ప్రసక్తి తీసుకురాకండి. వీణపై మీకుగల అభిమానాన్ని గ్రహించి, మీ ఆవేదనని తీర్చే ఉద్దేశంతో స్నేహధర్మంగానే మేము వీణని మీకు ఇయ్యదలిచాం. మీరు దానిని మాకు తిరిగి ఇచ్చేయగలిగినప్పుడు ఇచ్చేయండి." అన్నాడు మూర్తి.

శాస్త్రి కళ్ళనుంచి అశ్రువులు జాలువారసాగాయి. రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టి "మీకు నా కృతజ్ఞత ఎల్లా చెప్పాలో తోచడం లేదు" అంటూ మూర్తి, రాధికా ఇద్దరి వంకా చూశాడు.

ఆ వీణని తీసుకొని శాస్త్రి వెళ్తుంటే, వీధి గుమ్మంవరకూ సాగనంపారు మూర్తి, రాధికా. కృతజ్ఞతా దృక్కులతో సాగిపోయాడు శాస్త్రి. అతను కనుమరుగయేదాకా చూసి భారంగా నిట్టూర్చి లోనికి వచ్చారు వాళ్ళు.

"ఏ పరిస్థితులలోనూ ఆ వీణని ఇంకెవరికీ అమ్మవద్దు" అని శాస్త్రిని హెచ్చరిద్దామనుకున్నాడు మూర్తి. కాని అతను బాధపడతాడేమో నని ఆ మాటలు అనలేక పోయాడు.

ఇంట్లోకి తిరిగిరాగానే వారికి, ఆ పౌర్ణమినాటి రాత్రి, అమావాస్య నాటి రాత్రికన్నా ఎంతోచీకటి చీకటిగా అనిపించింది.

★ ★ ★

రెండు నెలల గడిచాయి. ఈరెండు నెలలూ, ఎవరో పరమ ఆత్మీయులు శాశ్వతంగా దూరమైనట్లుగా బాధపడ్డారు రాధికా, మూర్తీ. ఏనాడో ఆ ఇంట్లో కాపురం చేసిన విషాదం తిరిగి ఆ ఇంట్లో స్థావరం ఏర్పరచుకుంది. అనుకోకుండా ఒకరోజున కృష్ణశాస్త్రి తిరిగి వచ్చాడు. కూడా వీణని కూడా తెచ్చాడు. మనిషి బాగా చిక్కిపోయి ఉన్నాడు. ఆ వీణని చూసే సరికి మూర్తికీ, రాధికకీ పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లనిపించింది. విశేషాలు ఏమిటని మూర్తి అడిగాడు.

"అంతా బాగానే ఉంది. ఎంతో ప్రేమతో మీరు వీణని నాకు ఇచ్చారేకాని, నా మనస్సుకి శాంతి లేకుండా పోయింది. దానిని స్వీకరించడం, మీ మహత్తర త్యాగం ముందు ద్రోహంగా అనిపించసాగింది. ఆలోచించగా, ఆలోచించగా నాకు ఒక్కటే అనిపించింది. ఈ వీణని నాపిల్లలాగా చూసుకున్నాను. ఎంత గారాబంగా పెరిగినా, ఆడపిల్ల ఏనాటికైనా అత్తవారింటికి వెళ్ళవలసిందే. బిడ్డని అనువైన అత్తవారింటికి పంపడంలో ఉన్నాయి కన్నవారి తృప్తి, ఆనందమూనూ. అటువంటిది నా బిడ్డ వంటి ఈ వీణకి మీవంటి ఉత్తముల ఇంట్లో స్థావరం దొరకడం కంటే మహద్భాగ్యం మరేమి ఉంటుంది? అందుకే దానిని తీసుకువచ్చి మీకు అప్పచెబుతున్నాను. ఈ నిర్ణయానికి వచ్చాకనే నా మనస్సుకి శాంతి ఏర్పడింది. నాకు అవకాశం చిక్కినపుడు ఇక్కడికి వచ్చి ఆనందిస్తుంటాను. కనుక నా మాట మన్నించి మీ వీణని తీసుకొనండి" అన్నాడు శాస్త్రి. అతని కళ్ళు తృప్తితో మెరుస్తున్నాయి. బక్కచిక్కిన ఆముఖంలో ఒక వింత వెలుగు గోచరిస్తోంది.

"మొత్తానికి భలేవారే మీరు. మీరు చెప్పిందీ నిజమే. ఇద్దరికీ బాధలేకుండా మన వీణని కొన్నాళ్ళు మా దగ్గరగా కొన్నాళ్ళు మీదగ్గరగా ఉంచుకుందాం" అన్నాడు మూర్తి రాధిక వంక చూస్తూ.

రాధిక చిరునవ్వు నవ్వింది.

శాస్త్రి తల ఆడించాడు నవ్వు ముఖంతో.

మరునాడు ప్రొద్దునే శాస్త్రి తిరిగి విజయవాడ వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు మూర్తికి ఒక ఉత్తరం వచ్చింది. ఎక్కడి నుంచో అని క్రింద సంతకం చూస్తే అది శాస్త్రి దగ్గరనుంచి. ఆశ్చర్యపోతూ రాధికను పిలిచి ఉత్తరం చదవడం మొదలుపెట్టాడు మూర్తి.

"పూజ్య దంపతులు మూర్తి, రాధిక గార్లకు,

కృష్ణశాస్త్రి నమస్కరించి వ్రాయునది. నిన్ననే మీ వద్దకు వచ్చిన నా దగ్గర్నుంచి ఈ ఉత్తరమేమిటా అని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఇందులోని విషయాలు నేను మీతో చెప్పాలనుకున్నా చెప్పలేనివి కావడం వల్ల ఉత్తరం రూపేణా వ్రాస్తున్నాను.

విజయవాడలో నాకు వచ్చిన ఉద్యోగం నామమాత్రమేననీ అది నాకెందుకూ చాలదని మీకు తెలుసు. అయినా నేను అక్కడికి వెళ్ళిన కారణం, అసలు ఏదో ఉద్యోగంలో కుదురుకుంటే క్రమేపీ పైకి వెళ్ళవచ్చునని భావించాను. పైగా అక్కడ రేడియోలోనూ సంగీత సంస్థలలోనూ, మా నాన్నగారిని తెలిసిన వారుండడంతో వారిద్వారా నా విద్యని ప్రదర్శించే అవకాశం కల్పించుకుని, పేరు అంతకంటే ముఖ్యంగా ధనం సంపాదించ వీలుంటుందని భావించాను. కానీ రాజకీయాలలో మునిగి ఉన్న ప్రతిరంగంలోనూ, నా వంటి పలుకుబడిలేని అనామకుడు చేసిన ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి.

ఎన్నో అవాంతర పరిస్థితులలో మీ వీణని అమ్మివేయవలసి వస్తుందేమోనని భయపడ్డాను. దాన్ని అమ్మే అధికారం నాకు లేకపోవడం అటుంచి మీరు ఎంతో అభిమానంతోనూ, నాపై నమ్మకంతోనూ ఇచ్చిన ఆ వీణని జాగ్రత్తగా చూడవలసిన బాధ్యత నాపై ఉంది. అయినా అన్నార్తుడు స్వపర భేదాలను పాటించడన్న రీతిగా, నా అవసరం కొద్దీ ఏ క్షణంలో మీకు ద్రోహం చేసి, ఆ వస్తువు నమ్మివేస్తానోనని భయపడ సాగాను.

అందమైన, ఎంతో విలువైన మన వీణని చూచి చాలామంది దానికి మంచి ధర ఇస్తామనీ, అమ్మివేయమనీ ఒత్తిడి చేయసాగారు. మరికొందరు నా ఆకారం, పరిస్థితులు చూసి, ఆ వీణని ఎక్కడి నుంచైనా దొంగిలించి తెచ్చానేమోనని అనుమానించారు. మరికొందరు కాకిముక్కుకి దొండపండంటూ పరిహసించ సాగారు. అయినా నేను దేనికీ లెక్కచేయలేదు.

ఒకనాడు మా ఫ్యాక్టరీ వార్షికోత్సవం జరిగింది. మిత్రుల ప్రోద్బలంతో అప్పుడు నేను వీణ వాయించాను. నా కర్మకొద్దీ, ఆనాడు మా యజమాని కుమార్తె వచ్చింది. ఈ వీణ ఆమె కంటపడింది. ఆమె సంగీతం నేర్చుకుంటోంది. ఈ వీణ తనకి కావలని ఆమె తండ్రిని కోరిందట. అందువల్ల ఆయన దీనిని తనకి అమ్మివేయమనీ, కావలిస్తే ఇందుకు బదులుగా మరొక వీణ ఇచ్చి ఇంకా డబ్బు కూడా ఇస్తానని చెప్పాడు. నేను నా చరిత్రనీ ఆ వీణకీ, మీకూ, నాకూ గల సంబంధం గురించి వివరంగా చెప్పి, ఆ వీణని ఇయ్యలేనని చెప్పాను. నా ఆవేదనని అర్థం చేసుకునే సంస్కారం ఆయనలో లేకపోయింది. అన్నిటికీ డబ్బుతో సరికట్టడం ఆయనకి పరిపాటి. నేను ఎక్కువధరకోసం అల్లా అంటున్నా ననుకొని, ఇంకా ఎక్కువ ధర ఇస్తాననీ, జీతం కూడా పెంచుతానని, వీణని ఇచ్చేయమనీ బలవంతం చేయసాగాడు. అప్పటికీ నేను ఒప్పుకోక పోయేసరికి ఆయనకి కోపం వచ్చి ఉద్యోగం తీసేస్తానని బెదిరించాడు. అయినా నేను చలించలేదు. నిండా మునిగిన నాకు చలేమిటి? ఆయన అన్నంతపనీ చేశాడు. నేను జీవితంలో పోరాడి ఓడిపోయాను. ఎక్కడికో ఎవ్వరికీ అందకుండా పోవాలనుకున్నాను. కాని వెళ్ళే ముందు నా బిడ్డలాంటి ఈ వీణని, మీ వస్తువుని మీకు అప్పచెప్పడం నా విధి. ఉత్తమ సంస్కారం ఉన్న మీ పుణ్యదంపతులను చివరిసారిగా దర్శనం చేసుకుని, వీణని స్వయంగా మీకు అప్పచెప్పి, మీ సెలవు తీసుకోవడం నా విధి. అందుకే నిన్న వచ్చాను. మన .... కాదు ... మీ వీణని మీకు అప్పచెప్పాను.

ఇంక నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో ఏమి చెయ్యడానికో నాకే తెలియదు. యోగం ఉంటే ఎప్పటికైనా తిరిగి మిమ్మల్ని కలుస్తాను. లేకుంటే ఇదే నా చివరి కలయిక. నా వీణ, విద్వాంసులు, సంస్కారవంతులు అయిన మీ ఇంట భద్రంగా ఉండి సార్థకత సంతరించుకుంటుందనే తృప్తి

వెంటపెట్టుకుని వెళ్ళిపోతున్నాను.

సెలవు, మీ అభాగ్యుడు కృష్ణశాస్త్రి.

ఉత్తరం పూర్తి చేసేసరికి, అశ్రువులు ధారగా కారుతున్నాయి మూర్తికి. రాధిక వంక చూస్తే, ఆమెకూడా కన్నీళ్ళు చెంగుతో ఒత్తుకుంటోంది.

"కొందరి జీవితాలు అంతే, విధి చేతిలో మనందరం కీలుబొమ్మలం. చూసి బాధపడవలసిన వాళ్ళమేగాని, వాటిగతిని మనం మార్చలేం" అన్నారు మూర్తి భారంగా నిట్టూరుస్తూ.

"అతను వెళ్తూ వెళ్తూ మనమీద ఒక బరువైన బాధ్యతను పెట్టి వెళ్ళాడు. అతని బిడ్డలాంటి వీణని భద్రంగా చూస్తూ వైణికవిద్యకు వన్నెతేవడం మన విధి" అంది రాధిక లోనికి వెళ్తూ.

"నిజం. అంతకంటే మనం చేయగలిగిందేమీ ఉంది!" అంటూ ఆమెని అనుసరించాడు మూర్తి. మరుక్షణంలో ఆ ఇల్లు "మాణిక్యవీణాం" అంటూ ఉన్నదేవీస్తుతితో, వీణావాదనంతో మార్మోగింది.

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 19-3-1971)*